క్లుప్తంగా

నిర్మల కుమారికి డాక్టరేట్ ప్రదానం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని వీటీజేఎం మరియు ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ తలతోటి నిర్మల కుమారికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను శనివారం అందజేసింది. ఆంగ్ల సాహిత్యానికి సంబంధించిన అమితావ్ ఘోష్ నవలలపై పరిశోధనకు యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ నిర్మలకుమారికి పీహెచ్‌డీ ప్రదానం చేసింది. అమితావ్ ఘోష్ నవలల్లో భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం పరిణామాల ప్రభావం మరియు దృక్పథం అనే అంశంపై పరిశోధనా పత్రాలు నిర్మల కుమారి సమర్పించారు. ఈ మేరకు యూనివర్సిటీ ఆంగ్ల విభాగ అధిపతి ప్రొఫెసర్ కె.రత్నషీలా మణి పర్యవేక్షణలో పరిశోధన కొనసాగింది. ఈ సందర్భంగా మంగళగిరి వాసులు నిర్మల కుమారికి అభినందనలు తెలిపారు.

చెత్తాచెదారం తొలగింపు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లో కాలువల్లో తీసిన మురుగు, చెత్త పేరుకుపోవడంతో శనివారం సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో కొండమెట్లబజారు, రాజాపేట, లక్ష్మీపురం, రసూల్‌పేట ప్రాంతాల్లో మురుగు, చెత్తను తొలగింపజేశారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ఫిరంగిపురం: తాగునీటిలో పెరిగే ఎడిస్ దోమ లార్వా నిర్మూలనతోనే డెంగీ వ్యాధి దూరం అవుతుందని సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని శిరంగిపాలెంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల డెంగీతో బాధపడుతు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి కె.ఎలీష కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. విద్యార్థి ఇంటికి సమీపంలోని 80 గృహాలను ఆరోగ్యసిబ్బందితో సర్వే చేయించారు.

దేవస్థానంలో అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు దృష్టిలో ఉంచుకుని ఆలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతం చేశామని అన్నారు. ఉత్సవాలలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనపై ఢిల్లీ వైద్యబృందం సూచనలు



తెనాలిఅర్బన్: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ముస్కాన్ ఎసెస్‌మెంట్ టీమ్ తెనాలి జిల్లా వైద్యశాల పర్యటన శనివారంతో ముగిసింది. తల్లిపిల్లల వైద్యశాలలోని ఓపీ, ఎస్ఎన్‌సీయూ, క్యాజువాలిటీ వంటి విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు డాక్టర్ పొన్ను రాజు, డాక్టర్ సునీత పలివాల్‌లు మాట్లాడుతూ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ముస్కాన్ టీమ్ రెండు రోజులు తమ వైద్యశాలలో పర్యటించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ కంట్రోల్ నామ్స్ ప్రకారం వైద్యశాల నిర్వహిస్తుందా లేదా అనేది పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, డైట్ వంటి వాటిపై ఆరాతీశారు. వారు ఇచ్చిన సూచనలను అమలు చేస్తూ మరింత మెరుగైన వైద్యాన్ని చిన్నారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



నిడమర్రులో కళ్లజోళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

ఫిరంగిపురం: గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. మండలంలోని వసంతనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ప్రతిఒక్కరికి ఉచితంగా వైద్యం అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణప్రాంతాల్లోనే వైఎస్సార్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి 14 రకాల పరీక్షలు, 171 రకాల మందులు అందేలా చూస్తున్నారని చెప్పారు. ఆరోగ్యసిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించి అవసరమైన వారందరికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు అందజేశారన్నారు. శిబిరంలో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారని చెప్పారు. అవసరమైతే పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు అనారోగ్యం లేకుండా ఉండేందుకు ప్రత్యేక గైనికాలజిస్టులు శిబిరంలో పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ కంటివెలుగు ద్వారా పాఠశాలలో విద్యార్థులకు కళ్ల పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు 16 కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం తయారు చేసేవిధానం గురించి ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, తహసీల్దార్ పద్మనాభుడు, వైద్యులు పి.ఎస్తేరురాణి, ఫరీనాబేగం, యానీగ్రేస్, భీమేష్‌నాయక్, మేఘన, సీహెచ్ఓ వెంకటరమణ, సుదర్శన్‌రాజు, పార్టీ నాయకులు కె.చిన్నప్పరెడ్డి, మేడాబాబు, అంజిరెడ్డి, వై.రమాదేవి, జోస్ఫిన్ పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య రంగానికి పెద్ద పీట..

మేడికొండూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా చెప్పారు. మండలంలోని సిరిపురంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు జోసఫ్ రెడ్డి, ఎం.బాలస్వామి, మిరియాల శివరామకృష్ణ, సుభాని, ఎంపీడీఓ ప్రభాకరరావు పాల్గొన్నారు.

పొన్నెకల్లులో..

పొన్నెకల్లు(తాడికొండ): ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రజలకు అందించేందుకే ప్రభుత్వం కృషి చేస్తోందని తాడికొండ మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. శనివారం తాడికొండ మండలం పొన్నెకల్లు–2 సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పొన్నెకల్లు–2లో జరిగిన వైద్య శిబిరంలో 750 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి నూకతోటి మేరిమ్మ, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వీఆర్వో శివ శంకర్, నాగరాణి, కార్యదర్శి కరిముల్లా పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం

తాడేపల్లిరూరల్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి హాజరయ్యారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యసేవలు అందుకుంటున్న వారిని పరామర్శించి వైద్యం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంకా మెరుగైన వైద్య అందించాలనే సంకల్పంతో ఇంటింటికి వైద్యులను పంపించి సేవలు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి మాస్టర్, కొల్లి శేషిరెడ్డి, యోహాను పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



పొన్నెకల్లు జగనన్న ఆరోగ్య సురక్షలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బారులు తీరిన రోగులు

తాడేపల్లిరూరల్: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ కుమారి అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి మండల పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ రహమాన్, తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, సర్పంచి ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైద్యులు ప్రభాకర్ శివ, కె.తాజుద్దీన్, సుకన్య, ఇందిర, వివిధ గ్రామాల సర్పంచులు పలుకూరి మేరిరాణి, యార్లగడ్డ చంద్రదుర్గ, భవాని, జమ్ముల లోకేష్ పాల్గొన్నారు.

విదేశీ విద్యాలయాల్లో ఉపకార వేతనాలు

కేఎల్‌యూ డీన్ కిషోర్ బాబు



విదేశీ విద్యా మేళాను ప్రారంభిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీలలో ప్రత్యేక రాయితీలతో పాటు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నారని వర్సిటీ అంతర్జాతీయ పౌర సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తెలిపారు. శనివారం విదేశీ విద్యా మేళా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావుతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేఎల్‌యూకి అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని, ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశీ విశ్వ విద్యాలయాల్లో చేరాలనుకునే వారికి మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఫీజు రాయితీలతో పాటు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యకు వేసుకోవాల్సిన ప్రణాళిక, ఏ చదువుకు ఎలాంటి పరీక్షలు రాయాల్సి ఉంటుందనే అంశాలతో పాటు ఉత్తమ ర్యాంక్ ఉన్న యూనివర్సిటీలలో చేరాలంటే ఏ పరీక్షలో ఎన్ని మార్కులు సాధించాలనే విషయాలను ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డైరెక్టర్ విజయ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి రామారావు



పాదయాత్రలో ప్రజా సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసి, కార్మికుల పొట్టకొడుతున్న ప్రభుత్వాలను వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య పాదయాత్ర శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లాగా మార్చి, అన్ని రంగాల కార్మికులను ఇబ్బందుల పాలు చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి అనేకసార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసిందని, నిత్యావసరాలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డేశ్వరంలో భూ పోరాట కేంద్రంలో అసైన్డ్ భూముల్లో నివసిస్తున్న పేదలు తమకు నివసించే చోట ఇళ్ల స్థలాలు రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.అజయ్ కుమార్, ఎం.సూర్యారావు, ఎస్.బాలాజీ, జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లెకృష్ణ, సంసోను, పున్నయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 'ఇంటెల్'



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల ప్రిన్సిపాల్ రాణి జయకుమార్

మేడికొండూరు: గుంటూరు రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 విభాగంలో ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్‌లో అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన రోహిత్, బాస్కెట్‌బాల్ విభాగంలో సోహెల్ జిల్లా జట్టుకు స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోనూరి రాణి జయకుమార్ శనివారం తెలిపారు. త్వరలో గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఆనంద్, శ్రీకాంత్, సంజయ్, యాసిన్, అజ్మల్, బాలికల విభాగంలో షేక్ ఆసియా, సుల్తానా, గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల పీఈటీ రన్‌హుస్సేన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాణి జయకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆశ వర్కర్ కుటుంబానికి అండగా ప్రభుత్వం



కృపమ్మ కుటుంబానికి సహాయం అందజేస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆశ వర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబాన్ని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరామర్శించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఆశ వర్కర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. నిడమర్రులో కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆశ వర్కర్లు వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇక్కడి రానప్పటికీ కృపమ్మ మృతికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారని, రాష్ట్రంలో ఆశ వర్కర్ల సేవలు అమోఘమని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించేలా శాసన మండలిలోను, అసెంబ్లీలోను తప్పని సరిగా చర్చించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కారమయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేయాలని ఆశ వర్కర్లు ఎమ్మెల్సీని కోరగా స్పందించిన ఆయన తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డితో రూ.25 వేలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్టీ సెల్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, ఐద్వా రాష్ట్ర నాయకులు శ్రీనివాస కుమారి, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తాడేపల్లిరూరల్: బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళాబిల్లు ప్రయోజనం పొందాలంటే బీసీల వాటా తేలాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. శనివారం మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్‌లో ఇండియన్ బ్యాంక్ వద్ద ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కుల జన గణన పూర్తి చేసి చట్టసభల్లో బీసీలకు వాటా వారికి ఇవ్వాలని అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, మహిళా అధ్యక్షురాలు కాండ్రు కమల, కోశాధికారి కన్నా మాస్టారు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్–19 జట్టుకు ఎంపికైన కొర్రపాడు విద్యార్థి



ఎంపికైన విద్యార్థులతో కొర్రపాడు పాఠశాల ఉపాధ్యాయులు

మేడికొండూరు: మండలంలోని కొర్రపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంపాల రమేష్‌కుమార్ శనివారం తెలిపారు. గతనెల 27వ తేదీన కృష్ణా జిల్లా నందిగామలో నిర్వహించి అండర్–19 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో పాఠశాలకు చెందిన తొమ్మిది విద్యార్థులు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే అండర్–19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, పీఈటీ షేక్ కరీముల్లా, విద్యార్థులను అభినందించారు.

అండర్–14 బాలబాలికల జిల్లా రగ్బీ ప్రాబబుల్స్ ఎంపిక



రగ్బీ ఆడుతున్న క్రీడాకారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తెనాలి బైపాస్ రోడ్ వద్ద గల బాపూజీ విద్యాలయం మైదానంలో రాష్ట్రస్థాయి రగ్బీ సబ్ జూనియర్ చాంపియన్ షిప్ జట్ల ఎంపిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ చైర్మన్ తులసీరామ్ మాట్లాడుతూ జిల్లాలోని వినుకొండ, పేరేచర్ల, నిడమర్రు, చినకాకాని తదితర ప్రాంతాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొనగా 30 మంది బాలురను, 30 మంది బాలికలను ఎంపిక చేశామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్ షిప్ పోటీలలో వీరు తమ ప్రతిభను ప్రదర్శిస్తారని అన్నారు. గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షురాలు వై. సుజాత, పాఠశాల హెచ్‌ఎం శివచంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న కాకాని భాస్కరరావు, నిడమర్రు రవి, తక్కెలపాడు డానియేల్, జ్యోత్స్న రమాదేవి, బాలజీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో టిఫిన్ బండ్లను శనివారం అందజేశారు. తాడేపల్లి రైతు విభాగం కన్వీనర్ బందాపు రుక్మాంగరెడ్డి అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దార్ల హేమ పద్మజ, దొంతిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రమీల రాణి, భూపతి శివసత్య కిషోర్ పాల్గొన్నారు.

సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మకం

తెనాలి టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మక నిర్ణయంగా ప్రజలు పేర్కొంటున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలెప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు టి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అంగలకుదురులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి రాష్ట్రంలో 1.40లక్షల ఉద్యోగాలు కల్పించారని, ఎందరో యువతీ, యువకులకు ఉపాధి లభించినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే అంతా కలసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా ఉద్యోగులు, వలంటీర్లు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు, ఎంఈవో జయంత్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండి హేమారావు, జాస్తి శ్రీనివాసరావు, మొవ్వా ఆనంద్, తోట శ్రీకాంత్, మేరా సాహెబ్, బాదుల్లా, చుండూరు గోపి, కిరణ్ చంద్ పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సమావేశం

తాడికొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

ఎన్‌సీసీతో ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి

తెనాలి రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్ల రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. విద్యార్థుల్ని ఉద్దేశించి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి నేర్పిస్తుందని చెప్పారు. తమ విద్యార్థి జయేంద్ర కుమార్ ఈ ఏడాది ఎన్‌సీసీ ద్వారానే మెడిసిన్‌లో సీట్ సంపాదించడం కళాశాలకి గర్వకారణం అని కరస్పాండెంట్ మేరీ గ్రేస్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ప్రియదర్శిని, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగం సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సామ్యా నాయక్, కళాశాల సిబ్బంది, ఎన్‌సీసీ స్టాఫ్ పాల్గొన్నారు.